క్లుప్తంగా

బాలికలను చదివిద్దాం.. ప్రోత్సహిద్దాం



రేవిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బాలికలను చదివించాలని కోరుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు, అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు ఉండాలని, మహిళలు సాధికారత సాధించాలని విద్యార్థినులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, హెచ్ఎం వి.శంకరరావు, సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మాత్ముడు శ్రీరాముడు



మధురవాడలో ప్రవచనం వినిపిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: యుద్ధంలో కూడా ధర్మాన్ని పాటించే పరమ ధర్మాత్ముడు శ్రీరాముడని, సత్తువ వీగిపోయిన తనకి చేజిక్కిన రావణాసురుడుని కూడా ధర్మం పాటించి వదిలిపెట్టిన క్షమా గుణం చాలా గొప్పదని అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు వివరించారు. మధురవాడ గాయిత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణ శ్రీరామాయణం ప్రవచనంలో భాగంగా సోమవారం యుద్ధకాండలోని ఇంద్రజిత్తు, రావాణుసుర, కుంభకర్ణులకు, రామలక్ష్మణులు, వానరములకు మధ్య జరిగిన యుద్ధ ఘట్టాలను వివరించారు. నిర్వాహకులు అన్నంరాజు సత్యన్నారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వినికిడి పరికరాల వితరణ



వినికిడి పరికరాలు అందజేస్తున్న చారిటీ సభ్యులు

పీఎంపాలెం: ప్రపంచ హియరింగ్ డే ను పురస్కరించుకుని అవేర్‌నెస్ అండ్ చారిటీ ఈవెంట్ ప్రతినిధి శ్రీనివాసరావు చినగదిలి మండలంలోని భవిత మూగ చెవిటి దివ్యాంగుల కేంద్రం పిల్లలకు వినికిడి పరికరాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక సాంకేతిక ఇంజినీరింగ్ ఫార్మాసిటీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుత కుమార్, జిల్లా ఐఈ కోఆర్డినేటర్ బి.గీత, ఐఈఆర్‌పీ టీచర్స్ ఎస్‌కే సలీమా, ఎస్.మంగలక్ష్మి, భవిత విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద సోమవారం సర్వస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ చందవరపు కుమార్ సహకారంతో ఈ విగ్రహాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణలు, పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.3.50 లక్షల జరిమానా

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 35 మందికి సోమవారం భీమిలి 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య రూ.10వేలు వంతున రూ.3.50 లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ నిబంధనలు కఠినతరం చేసినందున వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

గతంలో అన్ని వస్తువులకు సంతలే ఆధారం

కాలక్రమేణా వ్యాపారంలో మార్పులు

సంతలు కనుమరుగు



వేములవలసలో నిత్యం మార్కెట్ జరిగే ప్రదేశం

తగరపువలస:

గ్రామీణ ప్రాంతాలలో ప్రతీవారం ఆరుబయట కూడళ్లలో ఎక్కువ సంఖ్యలో వ్యాపారులు, వినియోగదారులు జరిపే వినిమయప్రదేశాన్ని సంత అంటారు. పట్టణ ప్రాంతాలలో కూడా ఈ సంతలు జరుగుతుంటాయి. పేదలు ఎక్కువగా వినియోగించే వస్తువులు సంతల్లో విక్రయిస్తుంటారు. ముఖ్యంగా నిత్యవసర సరకులతో పాటు బట్టలు, మట్టి పాత్రలు, వ్యవసాయ పరికరాలు, గాజులు, కోళ్లు, మేకలు,చేపలు, అరటి, కొబ్బరి, వివిధ రకాల పండ్లు, పంచదార చిలకలు, నూనెలు, విత్తనాలు, టీ, టిఫిన్, పిండివంటలు, పువ్వులు, చిరుధాన్యాలు, ఫ్యాన్సీ వస్తువులతో పాటు ముక్కులు, చెవులు కుట్టేవాళ్లు, రెడీమేడ్ టైలర్లు, జాతకాలు చెప్పేవారు, బిక్షగాళ్లు ఎక్కువగా సంతలే ఆధారంగా జీవనం సాగించేవారు. ఈ సంతలపై ఆధారపడి చుట్టుపక్కల ప్రజలతో పాటు చిరు వ్యాపారులు ఎక్కువగా ఉండేవారు. ఆ సంత జరిగే ప్రదేశం చుట్టూ మరిన్ని అనుబంధ వ్యాపారాలు పక్కా భవనాలలో జరిగేవి. దీంతో ఈ ప్రాంతంలో లక్షలాది రూపాయలు చేతులు మారేవి. ఇవి కాకుండా పశువుల, చేపల సంతలు ప్రత్యేకంగా జరిగేవి.

కోవిడ్ తరువాత సంతల స్వరూపాలే మారిపోయాయి. ఎక్కడికక్కడ సంతలు విచ్ఛిన్నమైపోయాయి. అన్నిరకాల వస్తువులు ఆన్‌లైన్, మాల్స్‌లలో ఎప్పటికప్పుడు లభ్యమవుతున్నాయి. ఈ పరిణామంలోనే వ**సతులు లేని చోట** సంతలు మాయమ**వుతున్నాయి.**

అలాగే ఆనందపురం మండలంలోని ఆనందపురం (గురువారం), గంభీరం పంచాయతీలో బోయపాలెం (సోమవారం) సంతలు జరిగేవి. క్రమేణా ఇవి **కను**మరుగయ్యాయి. **దశాబ్దాల** తరబడి సంతలను **నమ్ముకున్న** నలుగురైదుగురు **వ్యాపారులు తప్ప** మిగిలిన వారి జాడ కనిపించడంలేదు.



ఆనందపురంలో గురువారం సంత జరిగే ప్రదేశం

చిరు వ్యాపారాలతో పెద్ద లావాదేవీలు

వారానికోసారి వ్యాపారులంతా ఒకే చోట చేరి ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారాలు నిర్వహించే వారు. భోజనం చేయడానికి కూడా విరామం లేకుండా వ్యాపారాలన్నీ కిటకిటలాడేవి. దూర ప్రాంతాల నుంచి సమష్టిగా కొందరు వ్యాపారులు ఎండ్లబండ్లపై సరకు తీసుకొచ్చి విక్రయించేవారు.



ఆనందపురం సంత ప్రాంతంలో కొనసాగుతున్న మసాలా దినుసుల దుకాణం



ఆనందపురం సంతలో గతంలో వెలుగు వెలిగిన టిఫిన్ దుకాణం ప్రస్తుతం ఇలా

సంతలకు వెళ్లే రహదారులు ఇరు**కు**గా మారిపోవడం, టాయిలెట్లు, **తాగు**నీరు, షెల్టర్లు లేకపోవడం, **జాతీయ**రహదారిని ఆనుకున్న ఉండ**టం తదితర** కారణాలతో ప్రస్తుతం ఆనం**దపురం, బోయి**పాలెం సంతలు కనుమరుగయ్యాయి. వీటికి ప్రత్యామ్నాయంగా వేములవలస మార్కెట్ వృద్ధి చెంది ఇక్కడి వ్యాపారాలు రూ.కోట్ల టర్నోవర్ జరుగుతోంది.

మా హోటల్ ఖాళీగా ఉండేది కాదు..



ఆనందపురంలో సంత జరిగే టప్పుడు మా హోటల్‌లో బేడకు కుడుం, అణాకు 8 ఇడ్లీలు ఇచ్చేవారం. అయినా ఖాళీ ఉండేది కాదు. బయట నుంచి పనివాళ్లను తెచ్చేవాళ్లం. వందలలో వ్యాపారం జరిగినా లాభదాయకంగా ఉండేది. ప్రస్తుతం గురువారం ఆరు దుకాణాలకు మించి వేయడం లేదు. సంత జరిగే రోజు రూ.1000 ఆదాయంకూడా రావడం లేదు.

–కప్పల రామయ్యమ్మ, ఆనందపురం

వ్యాపారం కొనసాగిస్తున్నా..



గతంలో మా తల్లిదండ్రులు పసుపు, కుంకుమ విక్రయాలతో పాటు ఆనందపురం సంతలో పిల్లలకు చెవులు కుట్టేవారు. విశాఖ నుంచి వాహనాలపై పచ్చి, ఎండు చేపలు తెచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం నేను 'ఏ వస్తువైనా రూ.10' వంటి ఫ్యాన్సీ వస్తువులు, వ్యవసాయ తాళ్లు విక్రయిస్తున్నాను. మా పూర్వీకుల దుకాణాన్ని కొనసాగిస్తున్నాను.

–పిల్లి కొండలరావు, తగరపువలస

మసాలా సామగ్రి విక్రయాలు



గతంలో ఆనందపురం సంత జరిగే ప్రదేశం దేవదాయశాఖది. మా పూర్వీకుల ఆచారాన్ని నేను కొనసాగిస్తూ మసాలా సామగ్రి విక్రయిస్తున్నా. మా పిల్లల్ని ఈ వ్యాపారం మీదే పెంచి పోషించాను. చాలా మంది వేములవలస మార్కెట్‌కు వెళ్లిపోయినా నేను మాత్రం ఇక్కడే ఉండిపోయాను. ఇక్కడ ఆశీలు ఉండవు అందువలన మాకు వ్యాపారం జరిగినా జరకగపోయినా నష్టం ఉండదు.

–మామిడి సాధువెంకటరావు, ఆనందపురం

గెడ్డకు సంరక్షణ చర్యలు



ఆక్రమణకు గురైన గెడ్డను పరిశీలిస్తున్న వీఆర్వో కర్రి జగదీశ్వరరావు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ స్వర్ణభారతినగర్‌లో రోజురోజుకు ఆక్రమణలు ఎక్కువైపోతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఆగకుండా గెడ్డను సైతం ఆక్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన స్వర్ణభారతి నగర్‌లో గెడ్డ ఆక్రమణలు అనే కథనానికి తహశీల్దార్ పాల్ కిరణ్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో కర్రి జగదీశ్వరరావు ఆక్రమిత స్థలాలను పరిశీలించారు. త్వరలో ఇక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

7న నూకాంబికా ఆలయ పునఃప్రారంభం



ప్రారంభోత్సానికి సిద్ధమవుతున్న నూకాలమ్మ అమ్మవారి ఆలయం

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్–మిథిలాపురి వుడా కాలనీ షిప్ యార్డు లే అవుట్‌లో వెలసిన నూకాంబిక అమ్మవారి ఆలయం పునః ప్రారంభించనున్నారు. ఈ మహోత్సవాలు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు. ఈ ప్రాంగణంలోని శ్రీ విజయ గణపతి, ఏకశిల నాగాభారణ, శివలింగాలతో ఈ ఆలయం పునఃప్రతిష్టాపనకు సిద్ధమవుతోంది. నిర్మాణ పనులు, పెయింటింగ్ పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. ప్రతిష్టాపనా మహోత్సవాలు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతిష్టాపనా మహోత్సవాలు బ్రహ్మశ్రీ దార్లపూడి సీతారామశర్మ, బ్రహ్మశ్రీ ఇప్పిలి సాయికిరణ్ శర్మ, బ్రహ్మశ్రీ అర్జింగి జగదీశ్వర్‌ల పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ దార్లపూడి సీతారామశర్మ ఆధ్వర్యంలో 12 మంది వేద పండితులతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్టు నిర్మాణ, అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

షూటింగ్ కోసం..వాహనాల నిలిపివేత

తగరపువలస: సోమవారం మిట్ట మధ్యాహ్నం భీమిలి–విశాఖ బీచ్‌రోడ్డులో సినిమా షూటింగ్ నిమిత్తం ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వ్యక్తులు వాహనదారులను నిలిపివేశారు. ఆ సమయంలో ఇంటర్మీడియట్ పరీక్ష రాసి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులతో పాటు ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఎండతో ఇదేం ఖర్మ అంటూ నిర్వాహకులపై రుసరుసలాడారు. పబ్లిక్‌కు ఇబ్బంది పెట్టి నడిరోడ్డుపై షూటింగ్‌లు ఏమిటని విసుక్కున్నారు.



షూటింగ్ జరుగుతుందంటూ బీచ్‌రోడ్డులో వాహనాలను నిలిపివేసిన దృశ్యం

పారిశుధ్య పనులు చేపట్టండి



మిథిలాపురి వుడా కాలనీలో డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ మిథిలాపురి వుడా కాలనీలో డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. వ్యర్థాలతో నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. జీవీఎంసీ పారిశుధ్య విభాగ అధికారులు స్పందించి శుభ్రత చర్యలు చేపట్టాలని యెక్కిరాల రుక్మిణి కోరారు.

వెలగని వీధి దీపాలు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2లో జీవీఎంసీకి చెందిన వివిధ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా అంధకారం రాజ్యమేలుతోంది. కొత్త వీధి దీపాలు ఎలాగూ వేయడం లేదు..ఉన్నవాటికి మరమ్మతులు చేయడం లేదు. జీవీఎంసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వీధుల్లోనే కాదు సెంట్రల్ లైటింగ్ కూడా అదే పరిస్థితి. నెలలు తరబడి వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానం ఆంజనేయులు కాలనీ, మధురవాడ జోనల్ ఆఫీసు పరిసర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మానం ఆంజనేయులు నగర్‌లో మరమ్మతులకు నోచుకోని విద్యుత్ దీపం

విద్యుత్ స్తంభాలకు ప్రచార హోర్డింగ్‌లు

- కోడ్ నంబర్లు కనిపించక ఇబ్బందులు



విద్యుత్ స్తంభం కోడ్ కనిపించకుండా అతికించిన ప్రచార హోర్డింగులు

పీఎంపాలెం : ఇంటి గోడపై ప్రచార పోస్టర్ అతికించాలన్నా..రాయాలన్నా..కచ్చితంగా ఆ ఇంటి యజమాని అనుమతి ఉండాలి. అలాగే ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించినా చర్యలుంటాయి. అయితే ఇవేం పట్టించుకోని కొందరు తమ వ్యాపార ప్రచార పోస్టర్లను, ఫ్లెక్సీలను యథేచ్ఛగా విద్యుత్ స్తంభాలకు అతికిస్తున్నారు. దీంతో విద్యుత్ స్తంభాలుకుండే కోడ్ నంబర్లు కనిపించడం లేదు. విద్యుత్ సమస్యలు తలెత్తటప్పుడు ఆ నంబర్లు కనిపించక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. పీఎంపాలెం, మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ సర్వీసుల కోసం వందలాది విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ప్రతి విద్యుత్ స్తంభానికి కోడ్ నంబర్లు ఏర్పాటు చేస్తారు. ఆయా వీధుల్లో గానీ, తమ ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు గానీ సిబ్బందికి ఫిర్యాదు చేయాలంటే కచ్చితంగా విద్యుత్ స్తంభానికి ఉండే కోడ్ నంబర్ చెప్పాలి. ఆ కోడ్ నంబర్ ఆధారంగా విద్యుత్ సమస్యలు ఏ ప్రాంతంలో తలెత్తాయో సిబ్బంది తెలుసుకుంటారు. అయితే చాలా మంది వ్యాపారులు తమ ప్రచార కరపత్రాలు, హోర్డింగ్‌లు విద్యుత్ స్తంభాలకు అతికించారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన



కాపులుప్పాడ డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్‌లోని కాపులుప్పాడ జీవీఎంసీ డంపింగ్ యార్డులో జీవీఎంసీ అధికారులు సోమవారం పర్యటించారు. ఏడీసీ సోమన్నారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్ కుమార్‌లు తదితరులు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, బయోమైనింగ్, ప్లాంటేషన్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, హార్టికల్చర్ కార్యకలాపాలు, బయో కంపోస్ట్ ప్లాంట్‌లు సందర్శించారు. ముఖ్యంగా స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలన బృందం ఇక్కడ పరిశీలించే పారా మీటర్స్ ఎలా అమలు అవుతున్నాయి. వారు వచ్చినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలి. తీసుకోవలసిన జాగ్రత్తలపై ట్రైల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎమ్‌హెచ్‌వో కిషోర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాల విలవిల

తగరపువలస: ఆనందపురం మండలం మీదుగా నిత్యం పశువుల అక్రమ రవాణా జరుగుతోంది. మూగజీవాలు విలవిలలాడే విధంగా వాటిని ఇరుకైన వాహనాల్లో కుక్కి తీసుకువెళ్లున్నారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుంచి పశువుల కబేళాలకు నిత్యం పద్మనాభం–నీళ్లకుండీల మార్గంలో వీటిని తరలిస్తున్నారు. ఈ మార్గంలో తనిఖీలు లేకపోవడంతో ప్రతిరోజూ చిన్న వాహనం నుంచి పెద్ద వాహనాల ద్వారా పశువులను తరలిస్తున్నారు. గోసంరక్షణ, హిందూమత పరిరక్షణ సంస్థల ప్రతినిధులు అక్రమ పశువుల రవాణాపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



క్రిక్కిరిసిన వాహనంలో తరలిస్తున్న పశువులు

గాదె గెలుపుతో సంబరాలు

తగరపువలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపుతో సోమవారం భీమిలిలో ఉపాధ్యాయులు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ పీఆర్‌టీయూ తరపున పోటీ చేసి మిత్ర సంఘాలైన ఆపస్, ఎస్‌టీయూ, ఏపీటీఎఫ్ 1938ల సహకారంతో అఖండ విజయం సాధించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రమాదేవి, ఎస్.రాజేంద్రప్రసాద్, ఎస్.రమణారావు, రొంగలి అప్పారావు, గరికిన పరదేశి, ఇమంది వెంకటరావు, గూన ప్రభాకర్, ఆల్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో జాతీయ సదస్సు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా ఏప్రిల్ 3,4 తేదీల్లో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. 'ఆర్థిక సమ్మిళిత–సామాజిక సమానత్వం : 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ ఒక రోడ్ మ్యాప్' అనే అంశంపై సదస్సు జరగనుంది. సదస్సు నిర్వాహకులను ఈ సందర్భంగా వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, సదస్సు కన్వీనర్ ఆచార్య జాలాది రవి, సదస్సు సహ కన్వీనర్ డాక్టర్ పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్య సంబంధిత క్రమశిక్షణను పెంపొందించడానికి అత్యధిక ప్రాధాన్యమిస్తామని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఇంజినీరింగ్, మహిళా ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులతో సోమవారం ఉదయం ఆయన సమావేశమయ్యారు. మధ్యాహ్నం ఫార్మసీ, న్యాయ, ఆర్ట్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులతో సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగంలో వసతుల కల్పన తదితర అంశాలకు సంబంధించిన వివరాలు, వినతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విభాగాల్లో తరగతులు పటిష్టంగా నిర్వహించాలని, విద్యార్థులు పూర్తి స్థాయిలో తరగతులకు హాజరు కావాలన్నారు. ప్రతి తరగతిలో విద్యార్థులందరూ నియమావళిని అనుసరించేలా ఆచార్యులు, విభాగాధిపతి చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు నిత్యం తరగతులకు వస్తేనే వారి నైపుణ్యాలు మరింత మెరుగవుతాయని, భవిష్యత్తులో ఉన్నత, ఉపాధి అవకాశాలను పొందడానికి వీలవుతుందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా సమీక్ష నిర్వహిస్తామని, ప్రతి విభాగంలోని సమస్యలను పరిష్కరించి, వసతులు మెరుగు పరచి అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నం చేస్తామన్నారు. త్వరలో జరగనున్న శతాబ్ది ఉత్సవాల్లో ప్రతి విభాగం భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు జి.శశిభూషణరావు, జి.గిరిజా శంకర్, ఎం.వి.ఆర్.రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ఆర్.పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

ఎంవీపీకాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్ ఎదుట శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి ముఖ్య అతిథిగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా ఎదగాలన్నారు. ఇందుకు అవసరమైన విజ్ఞానం, మానసిక స్థైర్యాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ దిశగా మహిళల్లో చైతన్యం తేవాలనే లక్ష్యంతో జిల్లాలోని అనేక శాఖలకు చెందిన మహిళలతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. సెక్టార్–9 సంక్షేమ భవన్ నుంచి ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులోని ఏఎస్ రాజా కూడలి వరకు ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి, పలు శాఖల డీడీలు, పీడీలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్జేడీ చిన్మయిదేవి తదితరులు